క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న డీఈఈ రాములు

సత్తుపల్లిటౌన్: ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ డీఈఈ ఎల్.రాములు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఆ ఏరియాలో లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శరత్‌బాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

తల్లాడ: తల్లాడలో గురువారం హ్యూమన్ రైట్స్ పొండేషన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ పొండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ అండ్ పొండర్ డాక్టర్ బొడ్డపాటి దాసు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తెలంగాణ హ్యూమన్ రైట్స్ పొండేషన్ ఎనుములు రుక్మిణి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తేళ్లూరి చిన్న ఏసు, మంచు కిరణ్, రోస్నిఖాన్, ఆదూరి మనీ, కృష్ణవేణి, మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

రఘురామరెడ్డి విజయం చరిత్రలో నిలిచిపోతుంది



బాలకృష్ణ

వైరా: పార్లమెంట్ ఎన్నికలలో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి విజయం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ కోచైర్మన్ సూర్యదేవర బాలకృష్ణ అన్నారు. గురువారం వైరాలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు రేవంత్ రెడ్డికి మద్దతు ఇస్తున్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇండియా కూటమి అభ్యర్థిగా పని చేసిన రామసహాయం రఘురామరెడ్డి విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా తీన్మార్ మల్లన్న విజయం అంచున ఉన్నారని ఆయన విజయానికి కృషి చేసిన పట్టభద్రులకు ధన్యవాదాలు తెలిపారు.

బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్నభోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో గురువారం మధ్యాహ్నభోజన వర్కర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 12న స్కూల్స్ రీ ఓపెనింగ్ సందర్భంగా మళ్లీ మధ్యాహ్న భోజనం కార్మికులు పిల్లలకు వంట వండి వడ్డించాలంటే డబ్బులు అవసరం ఉందని, పెండింగ్ బిల్లులు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు, మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కుంట వెంకమ్మ, ప్రధాన కార్యదర్శి మహాదేవ లక్ష్మి, ఎస్.కృష్ణవేణి, టి.కనకదుర్గ, కె.నాగలక్ష్మి, బి.సుజాత, అనసూర్య, జరీనా, వసంత, సీత, నాగమణి, రావులమ్మ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కొణిజర్ల: గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు సవాళ్లు అనే అంశంపై జూన్ 10న హైదరాబాద్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండలంలోని పెద్దమునగాల ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పనితో సంబంధం లేకుండా రూ.600 వేతనం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబ ఆలయాల్లో బాబాకి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయినాథునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయికి కర్పూర హారతులిచ్చి పూజలు చేసి.. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో.. జరభద్రం

ఫ్రెండ్ రిక్వెస్ట్‌తో తప్పదు మూల్యం

- ఇంటర్నెట్ వాడకంలో అప్రమత్తత అవసరం
- కొత్త స్నేహాలు తెస్తున్న సమస్యలు
- నకిలీ ఖాతాలకు చోటు ఇవ్వొద్దు..



వైరా: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత కొత్త కొత్త స్నేహాలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వారి ఆసక్తికి తగ్గట్టుగానే కొత్త వేదికలను ఏర్పాటు చేసుకోని తెలియని వ్యక్తులతో సైతం స్నేహం చేసేందుకు సోషల్ మీడియా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. అలా అని తొందరపడి అంగీకరించారో ఇరుకున పడే అవకాశం లేకపోలేదు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. సాధ్యమైనంత వరకు ఫ్రెండ్ రిక్వెస్టులు ఆమోదించకపోవడమే మంచిది. వారితో మనకు పరిచయాలు లేకపోవడంతో ఒకటికి రెండు సార్లు వారి ప్రొఫైల్స్‌ను పరిశీలించి అభ్యర్థనలు అంగీకరిస్తేనే మేలు. లేదంటే ఇరుకున పడడం తథ్యం.

అమ్మాయిల పేర్లతో అబ్బాయిలు..

సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నా కొద్దీ.. అపరిచితులు తెలివి మీరుతున్నారు. కొందరు యువకులు ఏకంగా అమ్మాయిల పేర్లతోనే నకిలీ ఖాతాలు తెరుస్తున్నారు. చాటింగ్‌లు చేసే క్రమంలో ప్రలోభాలకు గురి చేస్తుంటారు. ఈ విషయాన్ని ఎదుటివారు తొందరగా గుర్తించకపోతే బ్యాంకు ఖాతా, పిన్ నంబర్లు బయటకు చెప్పేలా చేస్తారు. ఈ విషయాల్లో అవగాహన లేని వారితో పాటుగా.. ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నత చదువులు చదువుకున్న వారు సైతం వీరి బారీన పడి ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు. కొత్త పరిచయమైన వారితో వ్యక్తిగత అంశానికి సంబంధించిన ఎటువంటి విషయాలను షేర్ చేసుకోకపోవడమే మంచిది.

పెరుగుతున్న సైబర్ నేరాలు..

మారుతున్న సాంకేతిక రంగంలో సామాజిక మాధ్యమాల హవా రోజురోజుకి మితిమీరిపోతున్నాయి. చిన్నా.. పెద్దా తేడా లేకుండా ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ (ఎక్స్), ఇన్‌స్టా ఖాతాదారులే వీటి ద్వారా ఎప్పుడో మర్చిపోయిన స్నేహబంధాలను పునరుద్ధించడమే కాకుండా కొత్త వ్యక్తుల పరిచయానికి బీజం వేస్తున్నాయి. పరిచయాలు చేసుకోవడం మంచిగానే ఉన్న అప్రమత్తత లేకపోతే మాత్రం అదే స్థాయిలో అవస్థలు తెచ్చిపెడుతున్నాయి.

- ప్రస్తుతం ప్రతీ ఐదు కుటుంబాల్లో నలుగురు నుంచి ఐదుగురు వరకు కూడా ఇంటర్నెట్ వాడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా వ్యవహరించే వారు 80 శాతంపైగా ఉన్నారు. రోజు కనీసం ఐదు నుంచి పదిసార్లు ఖాతాను తెరిచి స్పందించే వారు 50శాతం పైగా ఉన్నారు. కొత్త యాప్సను డౌన్‌లోడ్ చేయడంలో 40శాతంపైగా ఉన్నారని నిపుణుల అంచనా. 16 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన యువత రోజుకు ఆరు నుం,ఇ ఎనిమిది గంటల పైగా సెల్‌ఫోన్ వాడుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి.

అదో అద్భుతం.. వెంటనే దుర్భరం

వాస్తవానికి ఇంటర్నెట్ ఓ అద్భుతం అందులో జ్ఞానాన్ని గ్రహించిన వారికి బంగారు భవిష్యత్ దర్శనం ఇస్తుంది. మరోవైపు ఇదే ఇంటర్నెట్ మరల చెడు ప్రభావానికి కారణమవుతుంది. స్వార్థానికి, వ్యసనాలకు వినియోగించే వారు అవస్థల పాలవుతున్నారు. మోసాలకు, అక్రమాలకు పాల్పడే వారు కటకటాలు లెక్కించడం అనే మాట కాస్తా ఆలస్యం కూడా అవుతుంది. అవగాహన లేకుండా అమాయకంగా ఖాతా తెరిచి కొంత మంది విసిరే వలలో పడి బలి పశువులవుతున్నారు.

గేమ్స్‌తో కామ్..

క్యాండీ కర్స్, ఫార్మ్‌విల్లే, టెంపుల్‌రన్, పబ్‌జీ తదితర ఆటల కోసం అభ్యర్థనలు అధికంగా వస్తుంటాయి. ఒకవేళ మీరు వారితో ఆడాలనిపిస్తే యాక్సెస్ ఇచ్చేటప్పుడు మీ ప్రొఫైల్‌కు సంబంధించిన నియమాలు పాటించాలి. ఆట పేరుతో పరిచయమైన వారికి అక్కడితో పరిమితం చేయాలి. మీ ఖాతా, పాస్‌వర్డ్ ఎవరితో షేర్ చేసుకోకూడదు. ఎప్పటికప్పుడు పాస్‌వర్డ్ మారుస్తూ ఉండాలి. ఎక్కువగా సోషల్ మీడియాను వినియోగించే పిల్లలను తల్లిదండ్రులు అప్పుడప్పుడు కనిపెడుతూ ఉండాలి. ఒకవేళ సైబర్ నేరస్తులు మీ ఖాతాను హ్యాక్ చేశారనిపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

స్వీయ నియంత్రణ అవసరం..



సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో వాట్సాప్, ఫేస్‌బుక్‌ల పాత్ర ఎక్కువైంది. విదేశాల్లో ఉన్న తల్లిదండ్రులు స్నేహితులతో సందేశాల ద్వారా మాట్లాడుకునేందుకు పరిమితం చేయాలి. పనికిరాని కబుర్లు చెబుతూ విద్యార్థులను, మహిళలను ఆకర్షించేందుకు సోషల్ మీడియాను వాడితే చర్యలు తీసుకుంటాం. అపరిచిత వ్యక్తుల పట్ల కఠినంగా ఉండాల్సిందే. లేదంటే మోసపోవడం ఖాయం. – ఎంఏ రెహమాన్, ఏసీపీ, వైరా

లీకుల భగీరథ..

- వృథాగా పోతున్న తాగునీరు
- ప్రమాదాలకు కారణమవుతున్న వైనం..
- పట్టించుకోని అధికారులు



కల్లూరురూరల్: లింగాలలో వృథాగా పోతున్న భగీరథ నీరు



వైరారూరల్: పొలంలో..



తల్లాడ: రోడ్డుపై వరదలా పోతున్న తాగునీరు



మల్సూర్‌తండా వద్ద..

వైరారూరల్: మండలంలో మిషన్ భగీరథ పథకం అస్తవ్యస్తంగా మారింది. అష్టగుర్తి గ్రామ చెరువు సమీపంలో గుత్తా రాంబాబుకు చెందిన పొలంలో మిషన్ భగీరథ 700 డయా పీసీసీబీ పైపులైన్ గత ఆరునెలలుగా లీకు అవుతుంది. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో ఉన్న ముకిరి హిల్స్ పైన ఉన్న మిషన్ భగీరథ పథకం నుంచి పొద్దుటూరు, అష్టగుర్తి గ్రామాల ద్వారా ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాలకు ఈ పైపు లైను ద్వారా మంచి నీరు 24 గంటలు సరఫరా అవుతుంది. ఈ లీకేజీ కారణంగా బాధిత రైతుకు చెందిన మిరపపంట పాడవడంతో సుమారు రూ.2.50లక్షలు నష్టం వాటిల్లిందని రాంబాబు సోషల్‌మీడియాల్ పోస్ట్ పెట్టాడు. పొలమంతా నీటితో నిండి బురదమయంగా ఉండడంతో కౌలుకు తీసుకున్న రైతు కూడా సాగుచేయనని వదిలేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. కనీసం ఇప్పటికైన అధికారులు స్పందించి సదరు రైతు నష్టపోకుండా వెంటనే పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

కల్లూరురూరల్/తల్లాడ: కల్లూరు మండలంలోని లింగాల గ్రామ పంచాయతీలో ఐదురోజులుగా మిషన్ భగీరథ నీరు పైపులు పగిలి వృథాగా పోతున్నాయి. మిషన్ భగీరథ నీరు లింగాల నుంచి కొత్త ఎర్రబోయినపల్లి, పాత ఎర్రబోయినపల్లి, చెన్నూరు, రావికంపాడు తదితర గ్రామాలకు సరఫరా అవుతుంది. లింగాలలో పైపులు పగిలి పోవటం వల్ల పలు గ్రామాలకు నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అదే విధంగా తల్లాడ మండలంలోని దేవరపల్లి-వరంగల్ జాతీయ రహదారిపై నీరు వరదలా వృథాగా పోతుంది. రెండు రోజులుగా తల్లాడ మండలం మల్సూర్‌తండా గ్రామం వద్ద మిషన్ భగీరథ పైపులు నుంచి తాగు నీరు లీకై జాతీయ రహదారిలో, పొలాల్లో వృథాగా పోతుంది. ఇంత జరుగుతున్నా అధికారులకు మాత్రం పట్టడం లేదు. ఇకనైనా అధికారులు మరమ్మతులు చేసి నీటి సరఫరాను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జాలను ఉపేక్షించేది లేదు



బేతుపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: చెరువులు, గ్రామ కంఠాల భూములను కబ్జాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ స్పష్టం చేశారు. సత్తుపల్లి మండలంలోని గంగారం, బేతుపల్లి చెరువు అభివృద్ధి పనులను నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో చెరువులు, గ్రామకంఠా భూములు కబ్జా అయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు. అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. గంగారం అభివృద్ధి కోసం దాసరి మధుమోహన్‌రెడ్డి స్వచ్ఛందంగా సొంత నిధులతో చెరువు చుట్టూ మట్టితో కట్టలు పోసి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయటం పట్ల అభినందించారు. బేతుపల్లి చెరువుకట్టపై ర్యాంప్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టినాయన),ఒంటెద్దు సాయిలు, కోటమర్తి రమేష్, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, గ్రాండ్ మౌలాలీ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

దోస్త్ రెండోదశ ప్రారంభం

మధిర: దోస్త్ రెండో పేజ్ రిజిస్ట్రేషన్లు గురువారం నుంచి ప్రారంభమయ్యాయని మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్ఎస్ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఈ సంవత్సరం నుంచి సైన్స్ సెక్షన్లు ప్రారంభమయ్యాయని, తద్వారా కళాశాలలో అన్ని గ్రూపులు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని .. డిగ్రీలో చేరదలుచుకున్న విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చినట్లయితే అడ్మిషన్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ఈ నెల 13 వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, అడ్మిషన్ల విషయంలో సందేహాలు ఉంటే దోస్త్ కోఆర్డినేటర్ జి.అరుణ 9441786508 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్ జాదవ్

సత్తుపల్లిటౌన్: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని సత్తుపల్లి ఎంవీఐ జె.యోగేశ్వర్‌సింగ్ జాదవ్ స్పష్టం చేశారు. సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయంలో గురువారం స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేశారు. ప్రతి బస్సుకు ఫస్ట్‌ఎయిడ్ కిట్, ఎమర్జెన్సీ ద్వారం, ఫైర్ పరికరాలు, రేడియం స్టిక్కరింగ్, ఇండికేటర్స్, సీట్ కండీషన్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. స్కూల్ బస్సు లోపల డ్రైవర్, అటెండర్, ఫొటోలతో పాటు స్కూల్‌కు సంబంధించిన సమాచార పత్రాన్ని అంటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు ప్రసాదరావు, కృష్ణ ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

ముదిగొండ: విత్తన దుకాణాల వ్యాపారస్తులు, డీలర్లు రైతులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు అన్నారు. ముదిగొండలోని రైతు వేదికలో గురువారం విత్తన, పురుగు మందుల, ఎరువుల డీలర్లకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఏఈ ఎం రాధ, ఏఈఓ మౌనిక, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి వీరబాబు

మధిరరూరల్: మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. గురువారం పీహెచ్‌సీలో జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో వైద్యాధికారి వీరబాబు పాల్గొని మాట్లాడారు. రాబోయే వర్షాకాలంలో జనావాసాల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, దోమల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. 30 సంవత్సరాలు నిండిన వారందరికీ మహిళా ఆరోగ్య కార్యకర్త ఆధ్వర్యంలో షుగర్, బీపీ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యుల సూచన మేరకు ఉచితంగా మందులు ఇవ్వాలని కోరారు. విష జ్వరాలు ఉంటే వారిని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని ప్లేట్ లెట్స్ తగ్గిన వారిని కూడా వెంటనే పంపాలని సూచించారు. అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుభాషిణి, శరత్ బాబు, భాస్కర్ రావు, మరియరాణి, కిరణ్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, మరియమ్మ, సుజాత, రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పెంటర్ల యూనియన్ అధ్యక్షుడిగా లక్ష్మాచారి



ఎన్నికైన కార్పెంటర్ల యూనియన్ కార్యవర్గం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి కార్పెంటర్ల యూనియన్ అధ్యక్షుడిగా వెలిశాల లక్ష్మాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని తాపీ వర్కర్స్ యూనియన్ భవనంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉరిమెళ్ల సురేష్, కార్యదర్శిగా టి.హరీష్, సహాయ కార్యదర్శిగా ఎస్‌కె చిన్నబాబా, కోశాధికారిగా రుద్రాక్షల అప్పాచారిలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోదూరి మోహనాచారి, రుద్రాక్షల శ్రీనివాసాచారి, వెలిశాల నాగేంద్రాచారి, మొగదంపురం నర్సింహాచారి, యర్రోజు రామకృష్ణ, బాణాల కృష్ణప్రసాద్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లాచారి, ప్రసాద్, బాబు, శివ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తల్లాడ: తల్లాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి పేర్కొన్నారు. ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, వివిధ శాఖల పనితీరుపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పేదరికాన్ని నిర్మూలించాలి



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పెనుబల్లి: పేదరికం నిర్మూలన కోసం ప్రభుత్వాలు పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాదినేని రమేష్ అన్నారు. గురువారం మండలంలోని లంకపల్లి పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం రెండు రోజుల శిక్షణా తరగతులను రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాదినేని రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి నిధులు కేటాయించకుండా నీరుగారుస్తుందని, నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలతో ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ శిక్షణా తరగతులకు మండలంలోని అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు దూప్ సింగ్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, గుడిమెట్ల బాబు, టి. చిరంజీవి, మిట్టపల్లి నాగమణి, నాగ బాలకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో చేర్పించండి..

పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం పలు మండలాల్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశమై బడిబాట ఆవశ్యకతను వివరించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి వారి వివరాలు నమోదు చేసి ప్రభుత్వ పాఠశాలలో చేరాల్సిందిగా కోరారు.

సత్తుపల్లిటౌన్: బడిఈడు పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని ఎంఈఓ రాములు కోరారు. సత్తుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బడిబాట ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నారుగూడెంలో..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ ప్రారంభించి.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి బడిబాట ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, రాజకుమారి, వెంకటేశ్వర్లు, చావా గిరిజా రాణి, సరోజిని, వెంకటేశ్వర్లు, సమత పాల్గొన్నారు.

కల్లూరులో..



ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు: కల్లూరు ప్రాథమిక పాఠశాల పరిధిలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని ఎంఈఓ దామోదర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేసారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ పత్తిపాటి నివేదిత, హెచ్ఎం పాటిబండ్ల నాగపద్మ, ఉపాధ్యాయులు రాంబాబు, రాములు నాయక్, ఏసుపాదం, షహనాజ్ భేగం, మరియమ్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి, ఎస్కే అంజాద్ ఖాన్, రవి, రోజీనీల, బడిబాట ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు నున్నా కృష్ణయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు పసుపులేటి వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: మత్కేపల్లి పాఠశాలలో.. ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

పేరువంచలో..

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచలో గల ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు గురువారం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు ఎండి మౌలాలి, శ్రీనివాసరావు, శిరీష, సురేష్, మధుశ్రీ పాల్గొన్నారు.

మడుపల్లి హైస్కూల్‌లో..

మధిరరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని మడుపల్లి హైస్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లింగం పల్లి అప్పారావు కోరారు. గురువారం మడుపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంచిపోగు ఆదాం, కోనా బాబురావు, పైడిపల్లి కిషోర్, రామిరెడ్డి, గరికపాటి సుజాత పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాలలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

చింతకాని: మండలంలోని మత్కేపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలపరిధిలోని మేడేపల్లిలో గురువారం విద్యార్థులు పాఠశాలకు రావాలని ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు. అన్ని రంగాల్లో మేడేపల్లిలో ఉన్న జెడ్పీఉన్నత పాఠశాల ముందుందని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

ఎర్రుపాలెం: బడికి దూరంగా ఉండే పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత గ్రామ దీపికలు తీసుకోవాలని జెడ్పీ పాఠశాల(అమ్మ ఆదర్శ పాఠశాల) హెచ్ఎం జీవీఎస్ రాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో గ్రామ దీపికలు, పేరెంట్స్, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా రామిశెట్టి నాగమణిని ఎన్నిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెరుమాళ్ళ శ్రీనివాసరావు, ఐకేపీ సీసీ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని గొల్లెనపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం కేసీ వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాములమ్మ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు సర్కారు బడులలో కల్పించే సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.పవన్‌కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల: సింగరాయపాలెంలో విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేటలోని పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరావు, సూరి, సత్యావతి పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం లక్ష్మీనారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జుహేదా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి చిన్నారులను బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, కృష్ణమోహన్, వసంత, మాధవి, పద్మశ్రీ, రామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రామానుజాచార్యులు, శ్రీహరి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఆధ్వర్యంలో..

కారేపల్లి: కారేపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం, కళాశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల స్పెషలాఫీసర్ ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ.. బడిమానిన బాలికల్లో వెలుగులు నింపుతున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. అనంతరం కారేపల్లిలో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడళ్లలో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు సంధ్యారాణి, ఎండీ సమీన కౌసర్, శ్రీలత, కృష్ణవేణి, విజయలక్ష్మి, విజయ, మమత, ఎస్‌డీ నూర్జాహన్, ఎం స్వాతి, కె కవిత తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: తూతకలింగన్నపేటలో..